'కాగితం ముక్కలు, గాజు పెంకులు'

(క థా ని క)

వెనక తగిల్చిన పాత రైలు పెట్టెలను లాక్కొచ్చి వాళ్ళ ముందు గిరవాటెట్టింది కొత్త రైలింజన్. బ్రతుకంతా భ్రమ అనుకుని మడిగట్టుకుని మూల కూర్చుని పెదవి చప్పరించే వారికి యీ కొత్తింజన్ వొక సవాల్. భీకరమైన కూత – ఎక్కడో భూమిని దొల్చుకుని గోళం మధ్యలో కాలం బంధించిన ప్రళయాన్ని కదిపి ఆ ధ్వనుల్ని తనలో జీర్ణించుకుని గతంలోంచి ప్రాణాన్ని తెచ్చుకున్న ఒక చారిత్రాత్మక కళేబరం ఆ ఇంజన్. దాన్ని చూస్తే రైలు నడిపే వారికీ, ప్రయాణీకులకీ కూడా భయమే. కావాలనుకున్న రైలు ఆలస్యంగా రావడానికి వీలుచిక్కనీదు ఆ ఇంజన్. అసలు నాలుగైదు నిమిషాలు ముందే వెళ్ళి కూర్చుంటుందిట. రైల్వే వారి కదొక సమస్య. ప్రయాణీకులు ఎల్లానో అల్లా దానిలో వెళ్ళి పడాలి తీరుబడిగా, తాపీగా, నిశ్చింతగా, సోమరిగా ప్రవర్తించకూడదు. అది రావడం, వెళ్ళడం కూడా ఒక స్వప్నం లాంటిదే. అది కదలడం, వేగంగా కదలడం రెండూ వొకటే. మెల్లి మెల్లిగా వేగాన్ని పెంచుకోడం అంటూ లేదు.

"ఈ కొత్తింజన్‌కి తలకాయిలేదు కదూ – నాలా" అన్నాడు నరసింహం. పెట్టెలో సామాను పడేసిన చంద్రానికి నవొచ్చింది. అవును నరసింహానిది పెద్ద తల – పెద్ద మెడ, మొడ మొహం కలసిపోయినట్లు వొక స్తంభంలాగుంటై. తల పెద్దదిగా వుంటే, మెడ సన్నటిదిగా కనపడుతుందని, చదువుకునే రోజుల్లో జుట్టు పెంచేశాడు. పెద్ద వుంగరాల జుట్టు విచ్చల విడిగా పెరిగి నుదుటిమీద, కళ్ళల్లోనూ పడుతూ, వెనక్కి తోసినప్పుడల్లా చేతులకు పని చెబుతూ, మనిషి భీకరంగా వుండేవాడు– అందరూ "సింహం" అని పిలిచేవారు. మరిప్పుడో – ఆ జుట్టు లేదు. ఆర్మీలో ఉద్యోగం అదంతా కత్తిరించేసి పొట్టి క్రాప్ మెడవెనక పై భాగం ఆకుపచ్చ చర్మం పాచిలా కనిపిస్తూనే వుంటుంది.

"తల పెద్దదైతే భుజబలం ఉండదంటారుగా పెద్దలు. ఇంజన్‌కి అదుంది. ఈ రోజుల్లో కావల్సిందే అదిగా" అన్నాడు చంద్రం. కులాసా కబుర్లకు వ్యవధి నివ్వకుండా, ఒక పెద్ద కూత పెట్టింది. అది కూతగాదు. కంఠంలోంచి ధ్వనులు రావడం కాదు. మొత్తం శరీరం అంతా కంఠమై, అల్లాగయ్యే యత్నంలో ఆ కంఠం పగిలినప్పు డొచ్చిన ధ్వని. ప్లాటుఫారంపైన జనం అదిరిపడ్డారు.

"చూసావా—నే వున్నానని తెలిసి కాబోలు ఇంజన్‌గారు విర్రవీగి పోతున్నారు..." అన్నాడు 'సింహం.'

"రైలు కదులుతోంది" అన్నాడు చంద్రం.

"రైలు కదలడంలేదు"—ధాటికి భూమే వెనక్కి పారిపోతోంది. చాలా థ్యాంక్స్. ఈ నాలుగురోజులు హాయిగా గడిచాయి. అరుణకి మరీ మరీ థ్యాంక్స్ చెప్పు. ఇదిగో ఈ హంటర్ అంటే మోజుపడ్డావు దగ్గరుంచుకో—జ్ఞాపకార్థం."

అంటూ చేతులో హంటర్ చంద్రాని కిచ్చాడు. అతను తటపటా యిస్తున్నాడు. ఇంజిన్ మరొక్కసారి కేకేసింది—మిగిలిపోయిన ఆ కాస్త శక్తినీ యిప్పుడు పూరించుకుని. జండా పట్టుకున్న గార్డు కూడా అదిరిపడ్డాడు. ఒక్క గంతేసి రైల్లో పడ్డాడు గార్డు.

"చూశావా—వద్దంటానికి వీల్లేదు. ఇంజన్ కూడా నోరు కట్టేసుకో మంటోంది..."

"అప్పుడే చాలాదూరం వెళ్ళిపోయింది పెట్టె. 'సింహం' పెద్ద తలకాయ చిన్నదవుతోంది. చుక్కలాగై అంతర్ధానమైంది. హంటర్‌ని చేతిలో తిప్పుకుంటూ చంద్రం ఇంటికి బయలుదేరాడు. ఆర్మీలో పెద్ద ఉద్యోగస్తుడు వాడే. హంటర్ అది మూడడుగుల పొడవు, రెండంగుళాల వెడల్పుగల దండం చుట్టూ చాక్‌లెట్ రంగు తోలు చాపలా అల్లి వుంటుంది. ముందు ఒక అడుగు పొడుగు, రెండు తోలు పటకాలులాగ వేళ్ళాడుతూ ఉంటాయి. అది తన కేమీ ప్రయోజనం లేదు. స్నేహితులు జ్ఞాపకార్థం ఇచ్చింది. కాదనలేకపోయాడు. చదువుకునే రోజుల్లో మోటగా, కరుకుగా వుండేవాడు సింహం. పోకిరీ అని చెప్పుకోవడం

కూడా తనకి జ్ఞాపకం. ఆర్మీలో ఈ వుద్యోగం అతనికి సరి అయినదే. ఆర్మీలో వున్నాడంటే మోటగా, కరుకుగా వుండివుండాలి అనుకున్నాడు, చాలామందిలాగే తనూ. కాని సింహం అల్లాగ లేదు. నవ్వించడం కోసం కొంత చౌకబారు సంభాషణ సాగించినా—అరుణ ముందు మరీనూ—మొత్తం మీద నమ్రతగా, సంస్కారంతో వచ్చిన ఒక నాజూకుతో వ్యవహరించాడు. ఆర్మీలో వున్నవారికి ఎక్కువ వినోదాన్ని కల్పించి మామూలు సమాజంలో సాధ్యంకాని స్వేచ్ఛతో ప్రవర్తించే అవకాశాలు కల్పిస్తారుట. కదిపితే ఆ విషయాలన్నీ అతను చెప్పునేమో. ఏకాంతంగా అవన్నీ చెప్పుకునే అవకాశం దొరకలేదు. వారిద్దరి మధ్య ఏదో ఒక తెరలాంటిది వుంది. డబ్బు వల్లనో, హోదా వల్లనో, సంస్కారం వల్లనో, మసలే సమాజం వల్లనో దేనివల్లనై తేనేం, వారిద్దరూ అనుకున్నంత అన్యోన్యంగా, దగ్గరగా వుండలేకపోయారు. బహుశా 'అరుణ' సమక్షంలో వారిద్దరూ ఎక్కువగా గడపటంవల్లనేమో. చంద్రానికి నవ్వొచ్చింది. వున్న నాలుగురోజులు ఆమె ఎదురుగా వున్నా లేకపోయినా కూడా అరుణని అరుణగారూ అంటూనే వ్యవహరించాడు సింహం. రైలు కదిలేప్పుడు మాత్రం ఆ "గారూ" వదిలేసి "అరుణ" అనే వ్యవహరించాడు. అంటే ఈ నాలుగురోజుల్లోనూ వారి మధ్య పెంపొందిన అనురాగానికీ అన్యోన్యానికీ అదొక చిహ్నం. ఒకర్ని ఒకరు "గారు" అని సంబోధించే అవసరం వున్నంతవరకూ వారిని నిజమయిన స్నేహితులుగా పరిగణించడం సాధ్యం కాదేమో!

ఇంటికి చేరుకున్నాడు. మెట్లెక్కి తలుపు కొట్టాడు—నౌకరు తలుపు తీసి హాల్లో కుర్చీలు బల్లలు, సర్దుతున్నాడు. గోడగడియారం అప్పుడే పది కొట్టింది.. పోస్టుకు వెళ్ళి టపా తెస్తానని నౌకరు బయటికి వెళ్ళాడు. హంటర్ హాల్లో మధ్య బల్లమీద పడేసి, పత్రిక కోసం వెదుకుతూ పక్క గదిలో కెళ్ళబోయేముందు భార్యని పిలిచాడు. సమాధానం లేదు. మళ్ళా వెనక్కొచ్చి, ఏమీ తోచక బల్లమీద హంటర్ చేతిలో పట్టుకొని, గది దగ్గరికెళ్ళి తలుపుకొట్టాడు. ఒక్క క్షణం ఆగి తలుపు తోశాడు. సరిగ్గా పడని గడియ కాబోలు, చప్పుడు చేస్తూ కిందకి జారింది. తలుపు తోసు

కొని లోపలి కెళ్ళాడు. ఎదురుగా అద్దం బల్లముందు మడత మంచం మీద కూర్చుని ఏదో కాగితంకేసి చూస్తూ వుంది అరుణ. భర్త రాగానే కంగారుపడినట్లు వులిక్కిపడి తను చూస్తూ వున్న కాగితాన్ని గుప్పెట్లో దాచేసి అతనికేసి చూడకుండా "అబ్బ, అబ్బ. కాసేపు అవతలుండండి" అంది. ఇదివరకెన్నడూ చూడని అరుణని చూశాడు చంద్రం. తలంటు పోసుకుని జుట్టు తడిని తువ్వాలులో బిగించి ఆర్పుకొంటూ పల్చటి తెల్ల చీర పూర్తిగా కట్టుకోకుండా ఒంటికి సగం సగం చుట్టబెట్టుకొని జాకెట్టు లేని భుజంపైన జారిన తడికొంగు మడతగా మంచం కిందకి జారిన కొంగు చటుక్కుని కనబడక తువ్వాలును లాగి మెడచుట్టూ కప్పుకున్న అరుణ— అదొక వింత దృశ్యం. అరుణ—పల్చటి మనిషి. బహు లేత శరీరం. స్ఫుటంగా ఆకృతి పొందని అవయవాలు. గుండ్రతనం, నిండుతనం లేవు. అన్ని కోణాలు, బలహీనమైన ఎముకలూ, నరాలు. బ్యాటరీ లైటు ఆమె శరీరంపైన ఫోకస్ చేస్తే యిటు నుంచి అటు ప్రసరిస్తుంది కాంతి. బలంగా, లావుగా కనబడేందుకు ఆమె చేసే యత్నాలు చంద్రానికి తెలుసు. మందంగా వుండే బట్టతో అనేక మడతలుగా తీర్చిన లంగా, దానిమీద ఎనిమిది గజాల చీర, బయటికెళ్ళినప్పుడు వెల్వెట్ జాకెట్టు, సన్నటి, పల్చటి నాజూకైన మొహం. ప్రశాంతమైన కళ్ళు, శాశ్వతమైన మందహాసాన్ని సూచించే నోరు, జాలిగా మెరిసే క్రమమైన చిన్న పళ్ళ వరస, ఒంపుకు ఆస్కారం లేని చిన్న చెక్కిళ్ళు, ఆ మొహం మరీ అంత చిన్నదిగా కనపడ్డానికి కారణం ఆమె జుట్టు, దట్టంగా వొంపులు తిరిగిపోయిన మొహం, మెడ, భుజాలు ఆవరించే మందమయిన తలకట్టు.

గాలిలో అల్లాన కళ్ళు ఎర్రగా ఉన్నాయి. నిప్పులు గ్రక్కడం అంటే పువ్వుకికూడా ...ంతో పెదవులు చలించి చిన్న రంధ్రంలోంచి వున్నాయి. భూమండ... ఒక గీతగా పెదవులు చివరలో బిగుసుకున్నాయి.

జరిగింది. మడత మంచ...

క్కుంది. శ్వాస వేడిగా, త...

నొక్కిపెట్టిన గుప్పెటిపైన నరాలు పదునుగా తీర్చి వున్నాయి. ఏదో మహావృక్షం ఎన్నాళ్ళుగానో భూమికి పెనవేసుకున్న వేళ్ళలాగా—ఆ చేష్టలో ఒక వికృతమైన ప్రాచీన శక్తి కనిపించిన వాడికిమల్లే అరుణని చూసి చంద్రం దిగ్భ్రమ చెందాడు. క్షణంలో తేరుకున్నాడు.

"చేతిలో ఏమిటది ?"

సమాధానం లేదు.

ఒకడుగు ముందుకువేశాడు.

ఆమె భుజాల తడి ఆరింది—కాని చీరమడతలు తడికి చర్మాన్ని అంటిపెట్టుకొని శరీరకాంతిని బైటపెడుతున్నాయి. పరాయి స్త్రీగా కనబడుతోంది అరుణ.

"నిన్నే"

"బైటకెళ్ళండి" అంది గుప్పిడిని చీర మడతలో దాచుకుంటూ.

"ఏమిటది ?"

"ఏమీ లేదు"

"చెప్పాలి"

"ఏం లేదన్నానుగా"

చంద్రం మరో అడుగు ముందుకి వేశాడు. ఆమె మంచంమీద కొంచెం వెనక్కి జరిగింది. ఎడమచేతితో మంచం బద్దీని నొక్కినప్పుడు భుజంమీద ఒంపు రొమ్ములని కదిపి, చీర మడతలని కదుపుతున్నాయి.

"చెప్పి తీరాలి."

చంద్రంలో అస్పష్టమైన వాంఛ రేగినట్లు కళ్ళు పదే [illegible]
స్తున్నాడు. [illegible]. మళ్ళా

"చెప్పకపోతే ?" [illegible]ట్టుకొని, గది

అరుణ చూపులో, మాటలో పెంకితనం, [illegible] తోశాడు. సరిగ్గా
ప్రకటించింది. [illegible]రింది. తలుపు తోసు

కాగితం ముక్కలు, గాజు పెంకులు

"ఏం మాట్లాడుతున్నావో, ఎవరితో మాటాడుతున్నావ తెలుసా ?"

"తెలుసు."

"మరిల్లాగియ్యి అదేమిటో"

"ఇవ్వను. ఏం చేస్తారేమిటి ?

అరుణ సంసారబంధాన్ని విస్మరించింది. తను భార్య కాదు–వ్యక్తిత్వంతో ప్రజ్వరిల్లుతున్న ఒక ప్రాణి. ఆ తిరుగుబాటుతో ఆమె మరీ దూరమైపోతోంది. లోయలో నిలబడి దూరంగా శిఖరంపై కలని వెదుక్కుంటూ తిరుగాడే దేవకన్యని పిలిచినట్లుగా వుంది. అతనొక బురదగుంట. అందులో తారక ప్రతిబింబంగా అరుణ కదులుతోంది. ఆ తిరుగుబాటు అతనిని కవ్వించినట్లయింది. ఆమెను తన చేతుల మధ్య బిగించి ఆ శక్తికి ఆమె శరీరం పీడి రక్తం కారుతుంటే, అతనిలో కామజ్వాల చెలరేగి అందులో ఆమె హతమవుతే–ఏదో వెర్రి ఆవేశానికి లొంగిపోయ్యాడు చంద్రం. అతని ఆవేశం వెనక పురుషుడు, "మాన" వున్నాయి. చరిత్రలో కాయకష్టంచేసి, సౌందర్యాన్ని ఆరాధించి, విఫలులైన లక్షలాది మానవుల–పురుషత్వం ఉంది. తనింక ఆమె భర్త కాడు, చంద్రం కాడు. బలహీనమై, తనచేతిలో లొంగిపోయి, తనిష్టమొచ్చినట్లు వాడి ధ్వంసంచేసుకునేందుకు అనువైన ఒక స్త్రీ దొరికిన, పురుష, పశుశక్తుల కుప్ప.

"ఏం చేస్తానా?"

మీదికొస్తున్నాడు చంద్రం. నల్లమేఘాన్ని తరుము కొచ్చిన పెనుగాలిలో అల్లల్లాడిపోయిన గడ్డిపువ్వులా ఆమె ఒణికిపోయింది. ఆ గడ్డిపువ్వుకికూడా వేరుంది – విత్తనం వుంది. అవి భూమిలో పాతుకుని వున్నాయి. భూమండలంలో శక్తికి కదిలినట్లుంది ఆమె. ఇంకా వెనక్కి జరిగింది. మడత మంచం చివర – చీరకొంగు జారి రొమ్ములమధ్య ఇరుక్కుంది. శ్వాస వేడిగా, తెరలుగా వదుల్తోంది.

"నాకు తెలుసు" అన్నాడు.

"తెలిస్తే ఇంకెందుకు ? వెళ్ళండి."

"చూడకుండా వెళ్ళను."

"నేనే పెడతాను" అని లేవబోయింది అరుణ. చీర ముడి సరిగ్గా లేక నడుంమీదికి జారిపోతోంది. మంచంమ్మీది దుప్పటిని పైకిలాక్కుని కప్పుకుంటోంది. లేవలేదు. మళ్ళా అక్కడే చతికిలపడింది.

"అది ఉత్తరం, అవునా?"

"అవును"

"ఎవరు వ్రాశారు?"

అది తెలుసుకున్న వారు ఇదీ తెలుసుకోండి."

చంద్రంతల తిరుగుతోంది. అతని కంతా తేటతెల్లమయింది. మరిప్పుడు ఆవేదనలేదు, నరాలులాగడంలేదు–స్థిరపడి కార్యానికి సిద్ధపడు తున్నాయి. "సింహం" స్టేషన్‌లో "అరుణగారు" అనడం బదులు "అరుణ" అని ఎందుకన్నాడో తెలిసింది. వారిద్దరూ వున్నప్పుడు, ఆమె సంభాషణ అదోకలా నడిచింది. చెప్పుకొన్న కబుర్లన్నీ ఎవ రినో వుద్దేశించి చెప్పినట్లుగా వున్నాయి. అరుణ "సింహం" కేసి అదోకలా చూసింది. – ఆ చూపులో అమాయకత్వం బదులు, కుటిలత్వం కనబడింది. గుడ్లు వొప్పజెప్పేసిన చూపులవి. "సింహం" గురించి చదువుకునే రోజుల్లో నలుగురూ చెప్పినవి గుర్తుకొస్తున్నాయి. అతనిలో సంస్కారం లేదు, నాజూకులేదు – ఆర్మీలోవాళ్ళ మోటుతనం కరుకుతనం వున్నాయి. ఆ పెద్దతల, పాచిలా మెరిసే పెద్దమెడ, భీకర మైన కనుబొమ్మలు–బొగ్గుగనిలోకి తొంగిచూసినట్లు, నల్ల కళ్ళు–అబ్బ! ఆ స్థానంలో అతనుతప్ప, ఇంక ఎవరున్నా, ఆమెను క్షమించివుండును చంద్రం. ఆమెలో నాజూకు, అమాయకత్వం, మృదుత్వం సహజంగా వున్నాయి. వాటికి వ్యతిరేకమైన లక్షణాలు సింహంలో వున్నాయి. అందు కనే వాటిని కోరింది కాబోలు.

"ప్రేమలేఖ?"

"అవును"

"చూడనీ."

"చూడనివ్వను. మీకొచ్చిన ఉత్తరాలన్నీ నాకు చూపుతున్నారా?"

"వేళాకోళమా ?"

"నిజంగానే"

"ఇస్తావా యివ్వవా ?"

"ఇవ్వనంటినిగా."

అర్థంలేని ధ్వనిచేశాడు చంద్రం. ఆమె మీదికొచ్చాడు. అతని రెండు మోకాళ్ళు మంచం ముందు భాగంలో ఆనించి ఆమెను పట్టుకో బోయ్యాడు. అరుణ వెనక్కి కదిలింది. ఆమె చెయ్యి మెడ వెనకదాచింది. భుజం మీద పడింది అతని చెయ్యి. వేగ పాదం కప్పపిల్ల మీద పడట్టు. మంచం చివరికి జరిగింది – పట్టులేదు. లుంగచుట్టుకుని కిందపడింది. బరువుకి చంద్రం వున్న భాగం పైకి లేచిపడింది. అతను ఆ వూపుకి కింద వెల్లకిల పడ్డాడు. దెబ్బ తగిలింది. అతని చూపు తడబడుతోంది. వొస్తువులు కనిపించడంలేదు. బుర్రలో వాక్యం నిర్మాణం అవడం లేదు. ఏవో సగం సగం ధ్వనులు – లేస్తున్నాడు. లేచాడు. దూరంగా అరుణ వాడి వూడిన ఆకులా - ఒడ్డునపడి తెప్పరిల్లిన తెల్లపిల్ల కెరటంలా – చందమామను కప్పిన తెల్ల మేఘంలా అరుణ – ఊహలో అరుణ, జ్వాల నాలుక, కత్తి, బాణం, అగ్నిదేవుడు విప్పి పారేసిన వస్త్రం, చిలుక పొడిచిన ఎర్రపండు – "సింహం" నోట్లో నలిగిన పావురం అరుణ. తను బోనులో. లేచాడు, బోను కడ్డీలు వూడపీకుతున్నాడు. "ఇస్తావా ఇవ్వవా ?" ఆమె మీదికి వెళ్ళి, వొక్క వూపుతో ఆమెను నిలబెట్టి మంచం పైన కూలదోశాడు. చేతులో "హంటర్"ని గిర గిర తిప్పి, ప్రేళ్ళాడుతున్న పటకాలతో ఆమె జబ్బ మీదకొట్టాడు. ఆమె ఫెనుగులాట

విరమించి, మంచం మీద నుండి జారి, చేతి పట్టు విడిచేసి, కింద పడింది. చంద్రం ఆ ఉత్తరాన్ని చిక్కించుకున్నాడు. హంటర్‌ని బుజాన వేళ్ళా డేసుకుని హాల్లోకి నడిచాడు. బల్లమీద గ్లాసులో మంచినీళ్ళు తాగాడు. ముందు గదిలోకెళ్ళి తలుపేసుకుని ఉత్తరం చదువుకున్నాడు.

ఆకుపచ్చ రంగు కాగితం, పై భాగం చిరిగిపోయింది. అక్షరాలు సరిగ్గా కనపడటం లేదు.

"... నేనింక సుఖపెట్టగలనేమో. ఇన్నాళ్ళు ఉద్యోగం లేక నాతోపాటు నిన్ను కూడా ఈ సమిష్టి కుటుంబానికి బానిసగా చేశాను... నిర్మలమైన సెలయేటి అడుగున కనిపించే బంగారపు ఇసుకలాంటి నీ శరీర కాంతి, నా చీకటి కలను వెలిగించింది. అంతటి నిర్మలమైంది కూడా నీ హృదయం, సుకుమారమైంది నీ శరీరం. ఏటికి అటూ యిటూ గట్లంట ముళ్ళ పొదలు — పెద్ద పెద్ద చెట్లు - ముసలివై వూగిసలాడి కొనవూపిరితో భూమిని అంటిపెట్టుకున్న ఆ చెట్ల లాంటి నా జీవితానికి ఆ ఏరు మెల్లగా నృత్యం చేస్తూ, సున్నిత కంఠంతో గానం చేస్తూ ప్రవహిస్తూంటే చూసి ఆనందించటం తప్ప పరమావధి లేదు. అన్ని నదులూ ఎప్పుడో వొకప్పుడు ఒక చోట సముద్రంలో పడాల్సిందే అన్నాడు వొక కవి. ఇప్పుడా సమయం వొచ్చింది. ఉద్యోగం దొరికింది. నీకు ఉయ్యాలలంటే యిష్టం కదూ ? ... మనుష్యులు లేని ఏకాంత లోయలలో రెండు శిఖరాలకి మధ్య తగిలిద్దాం ఆనందం అనే ఉయ్యాలని ... సిగ్గుతో దూరంగా వెళ్ళని పిల్ల వాయువు ఆ ఉయ్యాలని వూపుతుంది. చెట్ల ఆకులు సంతోషానికి తట్టుకోలేక మన మీద ఊడిపడి మన ఆనందాన్ని పంచుకుంటాయి ... అరుణా ... కొండ వెనక నుంచి వొక్కసారిగా నీ మోము వెలిగించే ప్రభాత కిరణం, నీ స్నానం కోసం వేచివున్న అడివి కొలను ... మనకోసం ఎదురుచూస్తూ వున్నాయి."

తరువాత అక్షరాలు బొత్తిగా కనబడటంలేదు. సంతకంకూడా

లేదు. కాని చంద్రానికి తెలుసు. వివాహం అయిన మరుసటి సంవత్సరం, ఉద్యోగం దొరకగానే అతను, అరుణకి వ్రాసిన లేఖ అది. అవుతే, అంత దాపరికం దేనికి? అర్థంలేని మొండిపట్టా? మూర్ఖత్వమా? హాస్యధోరణిలో ప్రారంభించిన పెంకిపట్టు. విషాదంగా అంతమొందిందా? అతనికి అర్థం కావడంలేదు. ఆ ఉత్తరం అరుణకి ఆనందం యిచ్చివుండాలి, ఎన్నేళ్ళ క్రితమో తాను పొందిన ఆనందాన్ని మళ్ళా యిప్పుడు చదువుకుని పొందుదామన్న సంకల్పానికి తనరాక అంతరాయంగా పరిణమించింది. ఆ ఉత్తరం వ్రాసిన చంద్రంవేరు. ఆ చంద్రం ప్రియుడు – యవ్వనంలో స్వప్నాలల్లే మాంత్రికుడు. ఇప్పటి చంద్రం భర్త. ఉద్యోగం, హోదా, డబ్బు, నౌకర్లు, స్నేహితులు, మర్యాదలు – ఆమె భార్య – వొంటొండి పెడుతుంది. ఆ ఉత్తరం చదవడంలో గతించినకలలు తిరిగి ఊహలో సృష్టించుకొని, రహస్యమైన ఆనందం పొందుదామని, తలంటుపోసుకొని, అలంకరించుకుంటూ, ఏకాంతంగా గతంలో యాత్రకి బైలుదేరుతుండగా, భర్త అనే ఇప్పటిచంద్రం, వర్తమానాన్ని హంటర్ స్వరూపంలో తన ముందు ప్రత్యక్షమై ఆ ఊహా జగత్తుని ధ్వంసంచేశాడు. అందుకే అతన్ని పరాయివాడిగా, విరోధిగా తూలనాడి, ఎదురుతిరిగి, స్వప్న జగత్తులో తన నిజ స్వరూపాన్ని ఒక్కసారి చూపెట్టింది.

వారికిప్పుడు ఏలోటూ లేదని చంద్రానికి తెలుసు. డబ్బుంది, ఉద్యోగంవుంది, ఆరోగ్యంవుంది – అన్నివున్నాయి. కాని ఏదో లోపించింది. ఆలోపించింది ఆ ఉత్తరంలోవుంది. అందుకే అంతరహస్యం. గతానికో అద్దం ఆ ఉత్తరం. అందులో తన నిజస్వరూపం చూసుకుంటుంది. ఉత్తరం నలిగింది; అద్దం మసగ్గావుంది. అన్నీ మరకలు; తలంటుపోసి, శుభ్రం చేసినా బాగివదు...అంతే మరి.

చంద్రం హంటర్ తాళ్ళని తనవెన్నుమీద పేల్చుకు చూశాడు. శరీరానికి నెప్పి తెలుసు; బాధ తెలుసు. కాని హృదయానికి తెలిసేది గాయం. అద్దాన్ని పగలకొడుతుంది శరీరం. పగిలిన ముక్కల్ని ఏరి అతుకు పెడుతుంది హృదయం. హంటర్ బల్లమీద పడేసి, పైన పత్రిక కప్పి, అరుణగది కేసి నడిచాడు చంద్రం. ఆ పత్రికని హంటర్‌ని పూర్తిగా కప్పేటందుకు సర్దుతున్నప్పుడు, ఒక్క కన్నీటిబిందువు పడి, అక్కడ తడిసింది. ఒక్కటే బిందువు వుంది — పగిలినవాటిని అతుకు పెట్టే జిగురులాంటిది. అది కాస్తా యిప్పుడు పడిపోయింది.

—o:o—